# అక్కు పక్షులు

ఈ భూమ్మీద ఒకానొక దేశంలోని ఒకానొక రాష్ట్రంలో ఒక ముఖ్య మంత్రి మహోదయులు ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుందామని ఒక్కొక్క జిల్లాలో పదిరోజులపాటు పర్యటించి విజ్ఞాపన పత్రాలు స్వీకరిస్తామని ప్రకటించారు. మొత్తం ఇరవై జిల్లాలకు యాభైవేలు చొప్పున పది లక్షల విజ్ఞాపన పత్రాలు అందాయి.

అసంఖ్యాకమైన పిటిషన్లు. పిటిషన్లన్నీ కూడా జాగ్రత్తగా కట్టలు కట్టేసి ఇరవై జిల్లాల నుంచి ఇరవై లారీల్లో రాజధానికి బయలుదేరారు.

ప్రతి బహిరంగ సభలోనూ ముఖ్యమంత్రి మహోదయులు ఈ పిటిషన్లను క్రమపద్ధతిలో ఏరి కంప్యూటర్ ద్వారా విశ్లేషించి, ఆయా శాఖలకు పంపి నెలలోగా సమాధానాలు రాబట్టడం జరుగుతుందని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

ఒక నావికుని కొడుకు కేసబియాంకా. తండ్రి నావికా యుద్ధంలో పాల్గొనబోతుంటే తనూ వస్తానని మారాము చేస్తాడు. రణం అంటే భీకర మారణహోమం అని ఆ బుజ్జి పండుకేం తెలుసు? తండ్రి ఎంత వద్దన్నా విన్నాడుకాదు. తండ్రి వెంట పడ్డాడు. వాళ్లున్న పడవకి నిప్పంటుకుంది. చిన్నారి కేసబియాంకాని ఓ చోట దాచి తను వచ్చేవరకూ కదలొద్దన్నాడు. తండ్రి అగ్నిజ్వాలల్లో ఆహుతి అయినట్టు కొడుక్కి తెలియదు. "నాన్నారూ! నేను రావచ్చా?" అని అరిచి గగ్గోలు పెట్టాడు. ఆహుతి అయిన తండ్రి సమాధానం ఎలా చెబుతాడు? పాపం ఆ బుజ్జి కేసబియాంకా ఆ నౌకతో పాటే కాలిపోయాడు.

అలాగే ప్రజలు తమసమస్యలకి పరిష్కారం ఎప్పుడు దొరుకుతుందా? ఎప్పుడు ముఖ్యమంత్రిగారి నుంచి సమాధానం వస్తుందా అని కేసబి యాంకా లాగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

సరిగ్గా నెల అవగానే అదే ముఖ్య మంత్రిగారు ఒకానొక ప్రదేశ్‌లో ఒక పేపరు మిల్లు ప్రారంభిస్తూ రిబ్బను కోసారు. పేపరు మిల్లు నడవడానికి గుజ్జు అవసరం కనుక ఈ అరవై లారీలు పిటిషన్లు ఆ కాయితం మిల్లుకి చేరుకున్నాయి.

ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. మూడు కాయితం మిల్లులు ప్రారంభించబడ్డాయి.

ప్రజలు నిజంగా అక్కు పక్షులు.

23-7-1998

ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక